## మంత్రిని కలిసిన బ్రాహ్మణ సంఘం నేతలు



మంత్రి శ్రీధర్‌బాబుతో బ్రాహ్మణసంఘం నాయకులు

అందోల్, డిసెంబర్ 27: తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బ్రాహ్మణ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బ్రాహ్మణ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ, ప్రధాన కార్యదర్శి గాడిచెర్ల నాగేశ్వర్‌రావు తెలిపారు. బ్రాహ్మణ పరిషత్‌కు రూ.5 వందల కోట్లు కేటాయించాలని, ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను గుర్తించాలని విన్నవించినట్లు తెలిపారు. బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావుదేశ్‌పాండే, ఉపాధ్యక్షులు రాజశేఖర్‌కులకర్ణి, శేషాద్రికుమార్, ప్రధాన కార్యదర్శి వినోద్‌పాటిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంగమేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, డిసెంబర్ 27: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కోరారు. బుధవారం జహీరాబాద్ క్యాంపు కార్యాలయం నుంచి పత్రికాప్రకటన విడుదల చేశారు. గురువారం జహీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించే ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, మాజీ చైర్మన్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

## ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి, డిసెంబర్ 27: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, వెంటనే ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15వేలు ఇవ్వాలని బీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రావు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీరేశం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడాలి

జహీరాబాద్, డిసెంబర్ 27: ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దీన్ తెలిపారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. జనవరిలో పార్టీ సభ్యత్వాలు చేసేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఇండ్లు లేని పేదలకు స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు, తంజీం, ఇన్సాఫ్, ఆశ్వక్ హుస్సేన్, జహంగీర్, విశ్వనాథ్, గౌస్, అస్లాం, శంకర్, పూజ, అనిత, అమృతమ్మ, నాగమణి, సుశీలమ్మ, కళావతి, వినోద్ ఉన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామచంద్రాపురం, డిసెంబర్ 27: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. భెల్ నుంచి ఎల్ఐజీకి వచ్చే పాత రోడ్డు మార్గంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్కూటీపై వెళ్తున్న ఆర్సీపురానికి చెందిన కుమ్మరి అశ్వంత్ మృతదేహాన్ని గుర్తించి అతడి స్నేహితుడు శ్రవన్‌తో కలిసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఫిట్స్ రావడంతో కిందపడిపోయి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి 45నుంచి50 ఏండ్ల మధ్య ఉంటాడని, ఒంటిపై నీలి రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాపాలనకు పటిష్ట ఏర్పాట్లు



జహీరాబాద్: చెరాగ్‌పల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకారెడ్డి

ప్రభుత్వం గురువారం ప్రారంభించనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరు గ్యారంటీల అమలు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా అధికారులు ప్రజాపాలన సదస్సులు నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేశారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఉన్నతాధికారులు ఆయా గ్రామాల్లో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 27

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

**కంది ఎంపీపీ సరళాపుల్లారెడ్డి**



మాట్లాడుతున్న ఎంపీపీ సరళా పుల్లారెడ్డి

కంది, డిసెంబర్ 27: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని కంది మండల ఎంపీపీ సరళాపుల్లారెడ్డి అన్నారు. బుధవారం కంది మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు కోరారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందకు జారీ ప్రమాదకరంగా మారాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇంద్రకరణ్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. పటాన్చెరు నుంచి ఇంద్రకరణ్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని బస్సును నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ చెంద్రి శ్రీనివాస్ కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధుతో రైతులకు అండగా నిలిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ డబ్బులు ఎందుకు జమ చేయలేదని సభ్యులు ప్రశ్నించారు. ప్రస్తుతం రెండు ఎకరాల్లోపు ఉన్నవారికే రైతు భరోసా కింద డబ్బులు జమ అవుతున్నాయని సంబంధిత అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి సంధ్యారాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా మల్లన్న పల్లకీసేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

న్యాల్‌కల్, డిసెంబర్ 27: మండలంలోని మల్గి గ్రామ సమీపంలోని మల్లన్నస్వామి ఆలయం భక్తుల దర్శనాలతో కిక్కిరిసిపోయింది. వారం రోజులుగా కొనసాగుతున్న స్వామివారి జాతర ముగింపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు ఉపావాస దీక్షలతో ఆలయానికి తరలివచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారి పల్లకీసేవను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతీయాదవ్, ఎంపీటీసీ శివానంద శ్రీపాతి, సామాజికవేత్త నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు సిద్ధారెడ్డి, విఠల్, ఆలయ కమిటీ సభ్యులు రాజు, సంజురెడ్డి, వైద్యనాథ్, జైపాల్‌రెడ్డి, మారుతి, నగేశ్, సాయినాథ్, ఉమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## రామయ్య అక్షింతల ఊరేగింపు

హత్నూర, డిసెంబర్ 27: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను భక్తులు ఘనంగా ఊరేగించారు. బుధవారం హత్నూర శివాలయం నుంచి మాధుర గ్రామం వరకు అక్షింతలను భజన సంకీర్తనల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

## పెండింగ్ చలాన్లు చెల్లించాలి

రాయికోడ్, డిసెంబర్ 27: వాహనదారులు తమ పెండింగ్ చాలాన్లు రాయితీపై చెల్లించాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి కోరారు. జనవరి 10 వరకు బైక్‌లపై 80 శాతం, ఆర్టీసీ బస్సులకు 90 శాతం, ఆటోలు, కార్లకు 60 శాతం, ఇతర వాహనాలకు 50 రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

## ఘనంగా దత్తగిరి మహోత్సవాలు

నాగల్‌గిద్ద, డిసెంబర్ 27: మండలకేంద్రంలోని దత్తాత్రేయ ఆలయ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లావారుజామున నవగ్రహాలకు, పంచవృక్షలకు, దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర పండరీపూర్ పీఠాధిపతి అంబదాస్ మహరాజ్ భక్తులకు ప్రవచనాలు బోధించారు.

**దత్తాచలక్షేత్రంలో సామూహిక వ్రతాలు**

హత్నూర, డిసెంబర్ 27: దత్తాచలక్షేత్రంలో వారం రోజులుగా దత్తజయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆచరించారు. సాయంత్రం పాచిబండ్ల ఊరేగింపు నిర్వహించారు.

## డబుల్ బెడ్రూం ఇండ్ల పరిశీలన

హత్నూర, డిసెంబర్ 27: హత్నూర మండలం బోర్పట్ల శివారులో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. పేదలకు ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇండ్ల వద్ద తాగునీటి వసతి, విద్యుత్ కనెక్షన్, ముగురు కాల్వలు, అంతర్గత రోడ్ల నిర్మాణం తదితర సౌకర్యాలను పరిశీలించారు. డబుల్ బెడ్రూం ఇండ్లవద్ద ప్రజల సౌకర్యార్థం కల్పించాల్సిన పనులకు అదనంగా నిధులు అవసరం ఉంటే కలెక్టర్‌కు నివేదిక అందజేసి నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, సిబ్బంది ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం,డిసెంబర్ 27: ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ బస్తీ దర్శన్ నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు.

## అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

కోహీర్, డిసెంబర్ 27: ఓటరు లిస్టులో ఉన్న తప్పులను సరి చేయాలని తహసీల్దార్ శంతకుమారి ఆదేశించారు. బుధవారం కోహీర్ పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఆయా గ్రామాల బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చనిపోయిన వారి ఓటును తొలిగించేందుకు ముందుగా వారి కుటుంబసభ్యులకు నోటీసులు అందించాలని సూచించారు. తప్పులను సరిచేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు.

## రూ.2 లక్షల రైతురుణమాఫీ చేయాలి

సంగారెడ్డి, డిసెంబరు 27: కాంగ్రెస్ ఎన్నికల హామీ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా కమిటీ సమావేశాకి హాజరై మాట్లాడారు. రైతు రుణమాఫీ చేసి ధరణి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

## బాస్కెట్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు

జిన్నారం, డిసెంబర్ 27: అండర్ –17 ఎస్‌జీఎఫ్ స్టేట్‌మీట్‌కు జిన్నారం గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి బుధవారం తెలిపారు. 27 నుంచి 30 వరకు జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు గురుకుల పాఠశాల విద్యార్థులు కె.శివకుమార్, ఆర్.పుండ్లిక్ ప్రాతినిధ్యం వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

వట్‌పల్లి, డిసెంబర్ 27: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండల పరిధిలోని మర్వెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మానస, అఖిల పాల్గొనగా మానస జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి తెలిపారు. పాఠశాల తరపున జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థితోపాటు పీఈటీ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

**PUBLIC NOTICE**

The general public are hereby informed that my client Sri. Rajesh Jain s/o Bhawarlal Jain residing at Narayanguda Hyderabad, has entered into an agreement of sale with Sri. V. Pavan Kumar s/o V.Narsimulu Resident of house number 4-1-98, Prabhu Mandir, Sadashivpet Town and Mandal, Sangareddy District. The subject matter of this agreement of sale is to purchase agricultural land admeasuring 1 acre 8 Guntas situated at Maddikunta Village, Survey number 369, Sadashivpet Mandal, Sangareddy District.

The above said Vendor of the agricultural land Sri. V. Pavan Kumar s/o V.Narsimulu is the holder of Pattedar Pass book bearing number T09220271791 and Khata number 60767. My client has already paid valuable consideration to the said Vendor as advance and intends to pay the balance money and get the agricultural land registered in his name soon.

Any person/s having any interest or claim in the above property may approach the undersigned with documentary proof of their legal rights, within 10 days of this notice. No such claims will be entertained after this period.

Sd/- **ADITYA SAI DESHMUKH**
(B.A.LLB, LLM), ADVOCATE
Residence & Office: H.No:- 3-4-216, Kachiguda Station Road, Jain Mandir Lane, HYDERABAD 500 027 (T.S)
**MOBILE 99124 43435**
DATE:27/12/2023

यूको बैंक (भारत सरकार का उपक्रम) యూకో బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ)
కూకట్‌పల్లి శాఖ (1906), MIG # 298, రోడ్ నం.4,KPHB కాలనీ, హైదరాబాద్ - 500072.
టెలిఫోన్: 040-23055842/ 23057842, మొబైల్ నం. 7815894995

**సవరణ**

ఈ వార్తాపత్రిక ప్రచురణ తేది 14.12.2023లో రుణగ్రహీత M/s ప్రసాద్ మోటార్స్‌కు సంబంధించి కూకట్‌పల్లి శాఖ, స్థిరాస్తి యొక్క ఇ–వేలం అమ్మకం బహిరంగ ప్రకటన ప్రచురణలో కొన్ని మార్పులు ఉన్నవి. స్థిరాస్తి వివరణలో **ఇ–వేలం తేది 28.12.2023** కొన్ని కారణాల వలన **19.01.2024కు వాయిదా వేయబడినది.** వేలం యొక్క ఇతర నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు. వాటి కొరకు సవివరమైన ప్రకటన త్వరలోనే ప్రచురించబడుతుంది. జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాము.

తేది: 28.12.2023, ప్రదేశం : హైదరాబాద్ సం/– అధీకృత అధికారి, యూకో బ్యాంక్